# 'రామస్య ప్రియదర్శినీ'

[కథానిక]

✻

## — 'శ్రీ వాత్సవ' —

రామప్రియ వాయిస్తూవున్న వీణ అవతల పెట్టి రామశాస్త్రికేసి దీక్షగా చూచింది. అతడు వంచిన తల యెత్తకుండా వ్రాస్తున్నాడు. ఏం వ్రాస్తున్నాడో చూడాలన్న కుతూహలం రామప్రియకు అతిశయించింది. మళ్లా చూచింది. చూచి, ఝళంఝళత్కటకసూచితవేగపదారవిందయై లేచి...దురుములేనడు మల్లలనాడ అతని వెనుకనే వెళ్లి పరిశీలిస్తుంది. రామశాస్త్రి తాను వ్రాస్తూవున్నది చూపకుండా త్రిప్పి వేసుకున్నాడు. రామప్రియ నవ్వుమొగంతో ఆతని వెనుకవైపునించి చేయిజాచి వ్రాస్తున్నది లాగుకోబోతున్నది. రామశాస్త్రి దొరకనివ్వలేదు.

"ముట్టుకోకూడదు" అని అదిలించాడు.

"మడి కట్టుకున్నారా? ముట్టుకోనులెండి. ఆ వ్రాస్తున్నదేదో చూడనివ్వండి" అని అడిగింది.

"చూడకూడదు" అని దూరంగా జరిగాడు.

"అంత రహస్యమా? ప్రేమలేఖ వ్రాస్తున్నారా?"

"ప్రేమలేఖలు కాగితాలమీద వ్రాయడం ఎందుకు? చూపుల్లోనే అవి చదువుకొనేవాళ్ళుండగాను"

"ఓహో! అదా మీ వెలితిచూపుల కర్థం! కొత్త రాగంలోని సంగతులు ఆలోచిస్తున్నారేమో అనుకున్నాను"

"రామప్రియ వచ్చిందా?"

"ఇంతసేపటికి కనిపించానా?"

"నీమాట కాదు; నీకు నేర్పిన రామప్రియ కీర్తన మాట"

"ఇంతసేపూ వాయిస్తూవున్న దేమిటి?"

"ఏదో పరధ్యానంగా। ఉండి వినలేదు. వచ్చిందా?"

"వీణమీద సరిగ్గా రాలేదు. మీకో? కొత్తగా చెప్పిన పంచరత్న కీర్తన వల్లెవేశారా?"

"ఆఁ, ఏమిటి?" అని మళ్ళీ వ్రాయడం మొదలు పెట్టాడు రామశాస్త్రి.

"అంత పరధ్యానం ఏమిటండీ? మీరు వ్రాస్తున్నది నాకు చూపిస్తే తప్పా?"

"చూడకూడదని చెప్పానుకదా?"

"మీ పాఠం కూడా మాని అంత శ్రద్ధగా చేయవలసిన తొందర ఏమొచ్చింది? అందులో రహస్యం ఏమున్నదో?"

"రహస్యమే మరి-యీ వేళ సాయంకాలానికి ఇది పూర్తిచెయ్యాలి."

"కొత్త కీర్తన కట్టున్నారా, దేవిమీద పాడటానికి?"

"దేవీ నవరాత్రులు అయిపోతూవుంటే ఇంకా కొత్త కీర్తన వ్రాయడం దేనికి?"

"నిన్న మహర్నవమి కచేరీకి గురువుగారు ఏం బాగా పాడారండీ!"

"ముఖ్యంగా ఆ కామవర్ధని ఆలాపన..."

"మీకూ అదే నచ్చిందీ! ఆలాపనలో ఆయన చూపిన వింత పోకడలు ఇప్పటికీ వినిపిస్తున్నట్లుంది."

"ఆయనకు మనస్ఫూర్తిగా పాడాలనే ఆ భావన రావాలి! వస్తే సాక్షాత్తూ సరస్వతీదేవి పాడినట్టే!"

"ఏదీ, అనండీ-ఆ సంగతి ఒక్కసారి, క్రింది మధ్యమంనుంచి పైపంచమంలో."

త్రిస్థాయిలో రామశాస్త్రి గొంతుక సారించి ఆ సంగతి పలికించడానికి ప్రయత్నించాడు. ఆ రాగ స్థాయిలో లీనంఅవుతూ రామప్రియకేసి అరమోడ్పు కనులు సారించాడు. రామప్రియ వేడికోలుగా "ఆ వ్రాస్తున్న దేదో చెప్పరూ ?" అని మళ్ళా అడిగింది. రామశాస్త్రి "నీ కెందుకంత కుతూహలం?" అని వారించాడు.

"అయితే నాకు కొత్తపాఠం వ్రాసిపెట్టండి"

"నువ్వు వ్రాసుకోలేవా?"

"మీ అక్షరాలు అందంగా ఉంటాయని"

"అక్షరాలేనా?"

"మీ పరిహాసాల కేంగాని, గురువుగారు వచ్చేటప్పటికి వ్రాత పూర్తిచేసుకొని సిద్ధంగా ఉండాలని"

"గురువుగా రెక్కడికి వెళ్లారు? ఈ వేళ పాట కచ్చేరీ లేవీ లేవే?"

"పాటకచ్చేరీ లుంటే మనంమాత్రం వెళ్ళకుండా ఉంటామా? నవరాత్రి గానసభలకి వచ్చిన విద్వాంసుల నందరినీ సాగనంపడానికి వెళ్లారుగా"

"సరే, ఆయన వచ్చేక యింక పాఠం ఏముంటుంది?"

"ఎందుకు ఉండదు?"

"ఇప్పటి కప్పుడే సంజపడింది. వచ్చే త్రోవలో కొలనులో సంధ్య వార్చుకొని మరీ వస్తారు. అదిగో నాయనింగారి నాగస్వరవాద్యం! ఖరహరప్రియ ఎలాగ వాయిస్తున్నారో! దేవుడు యింక కాస్సేపటికో కాస్సేపటికో బయలుదేరుతాడు"

"ఎక్కడికి?"

"మరచిపోయావేమిటి రామప్రియా? ఈ వేళ గజోత్సవం; జమ్మికొట్టడానికి స్వామి ఊరేగివెళ్తారు"

"మీరూ వెళ్తారా?"

"నే నేమిటి? నువ్వూను! మన సహాధ్యాయులం అందరమూ కలిసి జమ్మిచెట్టుకు యీ లేఖ లంటించి రావద్దూ?"

"అదా ఇంతసేపటినించీ మీరు వ్రాస్తూ ఉన్నది?"

"ఆ శ్లోకమే! రహస్యం గ్రహించావు"

"ఇందులో రహస్యం ఏముంది? అవునుగాని, యీ శ్లోకాల కాగితాలు జమ్మిచెట్టుకు అంటిస్తే ఏమి వస్తుందండీ?"

"ఇది వ్రాసి క్రింద ఎవరిపేరు వ్రాస్తే వారికి మనస్సులో ఉన్న కోరిక లన్నీ తీరిపోతాయట!"

"మీ మనస్సులో కోరిక ఏమిటండీ?"

"ఎప్పటికైనా యీ నవరాత్రిగానసభలకి పాట కచ్చేరీ చేసి నిన్ను మెప్పించాలని"

"నన్ను మెప్పించడం ఎందుకు?"

"నిన్ను మెప్పిస్తే లోకాన్ని మెప్పించినట్టే!"

"ఏం ముఖస్తుతిమాటలండీ?"

"ముఖస్తుతిమాటలు కావు. నిజమే. ఈ శ్లోకం చదివి నీపేరుకూడా వ్రాసుకో"

"శమీ శమయతే పాపం
శమీ శత్రువినాశనీ
అర్జునస్య ధనుర్ధారీ
రామస్య ప్రియదర్శనీ.
—అంటే ఏమిటండీ?"

"పూర్వం యీ శమీవృక్షంమీద అర్జునుడు తన గాండీవం దాచుకొన్నాడు. రామచంద్రుడు సీతా వృత్తాంతం తెలుసుకొన్నాడు"

"ఈ రామశాస్త్రిగారు ఏం చేస్తారు?"

"రామప్రియను సందర్శిస్తాడు"

"అయితే నా కేం లాభం?"

"నీ కోరికకూడా కోరుకో!"

"మగనాలిగా జీవించాలని"

"మంచిదే! నీ సంగీతం—నీనాట్యం ఏం చేస్తావు?"

"వెలయాలుగా ఉంటేతప్ప సంగీతానికీ, నాట్యానికీ సభాపూజ్యత కాదా? ఇతరకులాలలో ఎందరు కులీనలు సభల్లో గానంచేసి, నాట్యంచేసి మన్ననలు పొందడంలేదు?"

"లేదని కాదు; మీ కులవృత్తి ఎక్కడికి పోతుంది?"

"అమానుషం—అందరికీ ముఖ్యమైన మానం విపణివీథిని అమ్ముకోవడం ఏం వృత్తిఅండీ?"

"అయితే—నీ కావృత్తి యిష్టంలేనపుడు ఎవరినో తగిన వరుణ్ని చూచి వివాహం చేసుకోలేక పోయావా? ఈ సంగీతం ఎందుకు నేర్చుకొన్నావు?"

"సంగీతం నేర్చుకొంటేమాత్రం పెండ్లి చేసుకొని శీలవతిగా జీవించకూడదా?"

"మరి నాట్యం నేర్చుకొన్నావు. గజ్జెపూజ అయింది. ఈ సంవత్సరం నవరాత్రులలో కుంభహారతిచ్చి......"

"కులటవృత్తి అవలంబించవలసిందా? గురువుగారి దయవల్ల కాలేదు. అయినా నామనస్సు అంగీకరించదు."

"మీవాళ్లు ఒప్పుకుంటారా?"

"నా మానప్రాణాలను రక్షించడానికి వాళ్ల ఒప్పుదలతో నిమిత్తం ఏముంది?"

"అంత పట్టుదలతో ఉంటే వివాహం చేసుకొంటేనే మంచిది..."

"దానికి మీ సహాయం కావాలి"

"దానికేం?...తగిన వరుణ్ని చూచి, నీ మంచితనాన్ని చెప్పగలను. నీవంటి లక్షణవతి అయిన పిల్లను కళ్ల నద్దుకొంటూ ఎవరు పడితే వాళ్లే వస్తారు."

"ఎవరుపడితే వాళ్లు కారు—నాకు నచ్చిన వరుడు కావాలి."

"పోనీ, ఎవరో చెప్పు—నేను ప్రయత్నించి చూస్తాను. నావల్లకాకపోతే గురువుగారిద్వారా ప్రయత్నిస్తాను."

"చాలామంచిది. మిమ్మల్నే కోరితేనో?"

"రామప్రియా! నువ్వు నిజంగా చెబుతున్నావా—నాతో పరిహాసం చేస్తున్నావా?" అని రామశాస్త్రి వాలుచూపులతో ప్రశ్నించాడు. రామప్రియ లజ్జాభరంతో మొగం వాల్చుకొని, క్రింది బొటనవ్రేలితో నేల రాస్తూ, కంపిస్తూవున్న పెదవులతో, తొట్రుపాటుపడే చూపులతో బదులుచెప్పింది.

"ఏం, మీ దాసి కాగోరే సాహసానికి నాలో యోగ్యత లేదంటారా?"

"రామప్రియా! ఎంత మాటన్నావు? ఈ పేద బ్రాహ్మణ్ని వరించి ఏం సుఖిస్తావని? నీవు కనుసన్న చేసినంతమాత్రంచేత కాళ్లముందర కనకాభిషేకం చేసేవాళ్లుండగా యీ నిరుపేదపైన నీ మనస్సు ఎలాగ పోయిందా అని నా ప్రశ్న."

"వెయ్యి కనకాభిషేకాలు చేసినా నా మనస్సులోని పెన్నిధానాన్ని కొనలేవుగదా!"

"నాపై అంత మనస్సునుంచినందుకు ధన్యుణ్ణి. కాని నన్ను వరించడంలో ఆనందసుఖాలనూ, భాగ్యభోగాలనూ విడిచి ఆపదలనూ, కష్టాలనూ వరిస్తున్నావన్నమాట"

"కానివ్వండి! వలచిన వరునితో ఆపద ఆనందం, కష్టాలే సౌఖ్యాలు!"

"సరే, యింత త్యాగానికి నే నేమివ్వగలను?"

"నా వాద్యానికి మీ గీతం—నా నాట్యానికి మీ గానం"

"నాలో విశిష్టత ఏ ముంది రామప్రియా! నేనూ నీతో సహాధ్యాయుణ్నే కదా?"

"అయినాసరే, నా కోరిక చెల్లించగలిగే త్యాగం మీరు చెయ్యాలి"

"త్యాగం నే చెయ్యవలసిం దేముంది?"

"మీ తలిదండ్రుల్నీ - వర్ణసంప్రదాయాల్నీ మీరగలగడం"

"నీ వంత స్వార్థత్యాగం చేసేటప్పుడు నే నింత మాత్రం చెయ్యలేనా?"

"చూద్దాం!"

"వచ్చే సంవత్సరం నవరాత్రాలకు తిరిగి నన్ని దుర్గాదేవికి బలియిచ్చేలోపున నన్ను రక్షించాలి"

"మన మిద్దరమూ ప్రయత్నిద్దాం- ఆ శమీపూజ చేసి వద్దాం! చాలా ప్రొద్దుపోయింది."

"అయితే, జమ్మికొట్టేటప్పుడు నేనుకూడా వస్తా!"

"ఇదిగో! నీ చీటే మరచిపోయావు"

మళ్లీ యిద్దరూ శమీపూజశ్లోకం చదువుకొన్నారు.

"రామస్య ప్రియదర్శనీ" అన్నమాట చూచి ఇద్దరూ నవ్వుకొన్నారు.

## ౨

ఒక సంవత్సరం గడచిపోయింది. తిరిగి నవరాత్రి ఉత్సవాలు కాకినాడలో. ఈమాటు ఉత్సవాలకూ, ఊరేగింపుకూ అలివేణి మేజువాణి ఏర్పాటు చేశారు. అలివేణి కూతురు రామప్రియ వ్యక్తురాలయింది. నాట్యం, సంగీతం పూర్తిచేసింది. మహర్నవమినాడు-దేవాలయంలో కుంభహారతి చేయించి యింక కులవృత్తిలో ప్రవేశపెట్టాలని అలివేణి అభిలాష. ఆ వేళ సాయంసమయం మంటపంలో జరిగిన పాటకచ్చేరీలో మహావిద్వాంసుడు పేరిశాస్త్రిగారి గానంలోనే ప్రక్కపాటకుడు, ప్రియశిష్యుడు రామశాస్త్రిగారి గానం మిళితమై సభాసదుల ప్రశంసాపాత్ర మయింది. వచ్చేసంవత్సరం యీ పాటికి రామశాస్త్రి స్వయంగా కచ్చేరీ చేయగల డంటున్నారు. అతనికి మాత్రం దక్షిణాది వెళ్ళి విద్వాంసుల దగ్గర విద్య అభ్యసించి రావాలని ఉంది. దానికి పేరిశాస్త్రి గారు కూడా దోహదంచేసి నవరాత్రోత్సవాలకు వచ్చిన విద్వాంసు డొకరితో ఏర్పాటుచేశారు. ఆనాటి కచ్చేరీలో రాగమాలిక పాడుతూవుండే గురువుగారు కామవర్ధని పాడి వదిలేశారు. శిష్యుడు రామశాస్త్రి అందుకొని, పావురా గుబాళింపుల వంటి సంగతులన్నీ వేసి చూపించాడు. 'భేష్' అన్న సభాసదులవైపు చూస్తూవుంటే స్త్రీల ప్రత్యేక స్థలంలో విప్పారిన రెండు ప్రశంసానేత్రాలు తళుక్కుమన్నాయి. రామశాస్త్రికి సంవత్సరం క్రితం సంగతి జ్ఞాపకం వచ్చింది. వాగ్దానభంగం చేయకూడదు. ఆ జవ్వని సోగకన్నులలో జాలిగా వేడుకొనే ప్రార్థన కనిపించింది.

సభ అయిపోయింది. ఎవరిదారిని వారు వెళ్ళుతున్నారు. అలివేణి రామశాస్త్రికి నమస్కారం చేసి "మీ విద్య చూపించారు—మా పిల్ల విద్య కూడా చూద్దురుగాని యీ రాత్రి దయచేయరూ?" అని పిలిచింది. రామప్రియ వెనుక ఆగిపోయి, రామశాస్త్రిని "వాగ్దానం నిలుపుకోరూ? నన్ను రక్షించరూ?" అని వేడుకొంది. తడబడుతూ రామశాస్త్రి "అలాగే" అన్నాడు. "రామస్య ప్రియదర్శనీ" అని ఒక నవ్వు నవ్వి "యీ రాత్రే—పదిగంటలకు, జమ్మిచెట్టు క్రింద" అని సంకేతం చెప్పి మరుని చేకటారిలాగ రామప్రియ వెళ్లిపోయింది.

రామశాస్త్రి పరిపరివిధాల తర్కించుకొన్నాడు. ఒక సర్వవిద్యాపారంగతురాలిని— ఒక సద్గుణవంతురాలిని అసహాయను చేసి, ధనంకోసం బలియిస్తున్నారు. ప్రాణభంగంకంటే నీచమైన మానభంగం! లజ్జా విహీనమైన దుర్వృత్తినించి, మహాపాపకూపంనించి ఆ అబలను తాను రక్షించాలి. పైగా సుదీర్ఘమైన వేణీభారంతో, ఆకర్ణాంత విశాల నేత్రాలతో, వికసించిన యౌవనవిలాసంతో లక్ష్మీదేవిలాగుంది. అటువంటి స్త్రీని అడ్డమైన వాళ్ళకు అర్పించవలసిందేనా? వద్దు. రక్షించాలి. ఇదే న్యాయం. ఆమె చెప్పిన సంకేతం జ్ఞాపకం ఉంచుకున్నాడు.

ఆ రాత్రి 'కుంభహారతి' కి పోవడానికి బదులు కుహనారోగం కల్పించుకొని రామప్రియ విడిదిలోనే ఆగిపోయింది. ఊరి చివర జమ్మిచెట్టుకు ఎదురుగానే అలివేణి మేళంవాళ్ళ విడిది. అలివేణీ, మిగతా హంగుదారులూ స్వామిసేవకు వెళ్లారు. గుడిలో రామప్రియ లేకుండా మేళం జరుగుతూఉంది. అభిసారిక రామప్రియ బయలుదేరింది. శమీపూజ చేయించుకొనే కుతూహలంతో ఆ శమీవృక్షం గంభీరంగా ఆనవమి వెన్నెలలోని చిరునీడలు చూచుకుంటూ చిరుగాలుల కూని

రాగాలు తీస్తోంది. ఆ క్రీనీడలో రామశాస్త్రి నిలుచుండి ఆమెకోసం ఎదురుచూస్తున్నాడు. రామప్రియ రావడమే తడవుగా అప్పటికే మాటలాడి ఉంచిన గుఱ్ఱపు బండిమీద అతివేగంగా వాళ్ళిద్దరూ నిష్క్రమించారు. రాత్రివేళ వాళ్ళ ప్రయాణానికి అనువైన రైలుబండి దొరికింది. ఇంక బ్రతికి బయటపడ్డామనే నిట్టూర్పుతో బండి యెక్కారు. రైలుపట్టాల రణగుణధ్వనులలో వారి యిరువురి పడుచు హృదయాలలోని ఆరాటం తెలియడం లేదుగాని, బండెడు భారంతో క్రుంగిపోతున్నారు. ఒకరిని ఒకరు పలుకరించుకోకుండా మూగనోములోనే వారి మనోభారం తెలియపరుచుకొంటున్నారు.

మర్నాడు తెల్లారుజామున మేలుకొలుపులు పాడకుండానే అలివేణి ముందే విడిదికి వచ్చివేసి, జబ్బుతో పడివున్న కూతురికేసి చూచింది. ఆ ప్రక్కలో కప్పిన కాశ్మీరశాలువా తొలగించి చూస్తే—పొడుగాటి దిండు పడిఉన్నది. తనకూతురు ఇంత పని చేస్తుందని నమ్మలేకపోయింది. చివరికి చివరికి అవగాహన చేసుకొని వెంటనే స్టేషనుకు వెళ్లి అక్కడ దర్యాప్తుచేస్తే—రామశాస్త్రీ, అతనితో ఒక స్త్రీ మద్రాసు వెళ్లినట్టు తెలిసింది. అపుడే ఉన్న ప్యాసింజరులో తానుకూడా బయలుదేరింది. మద్రాసు చేరుకొని అన్ని హోటళ్ళలోనూ పరీక్షచేయగా వాళ్లున్న ఉనికి తెలిసింది. అలివేణి అనరాని, వినరాని దుర్భాషలతో రామశాస్త్రిని తూలనాడింది. ఆ ప్రవాహం అంతా ముంచుకొని పడుతూవుంటే రామశాస్త్రి నిర్విణ్ణుడై నిలుచుండి చూస్తున్నాడు. రామప్రియ ముగ్ధురాలు—తల్లి చేసే తిట్టిపోతలకు మారాడలేకపోయింది. రామశాస్త్రి అంతా విని ఏదో చెప్పబోతే, అలివేణి అందుకొని "ఏ పాపమూ ఎరగని పిల్లకు మందో, మాకో పెట్టి యిలా చేశారు. సిద్ధాన్నం చెడగొట్టి, ఇలాగ లేవదీసుకొని రావటం మీకు న్యాయమేనా అండీ! మీరూ చిన్నవారు. ఇంకా చదువుకొని పదిమందిలో పేరుప్రతిష్ఠలు తెచ్చుకోవలసినవారు. తల్లికీ పిల్లకూ ఎడబాపులు చేసి యిలాగ తేవడం మీకేమంత జయకరం" అని అడిగింది.

"ఇందులో నా తప్పేమీ లేదు. మీ అమ్మాయినే అడుగు" అని జవాబు చెప్పాడు.

"దానికేం తెలుసు? కసుగాయ. యౌవనమదంలో కళ్లు కనిపించక వచ్చివేసింది. తెలిసున్నవారు మీరైనా బుద్ధి చెప్పవద్దూ?" అని మళ్లీ అందుకొంది. రామప్రియ యీ మాటలన్నీ మరి వినలేక, తల్లితో "యింక యెంత అల్లరి చేసినా రాదలచుకోలే" దని నిష్కర్షగా చెప్పివేసింది. అయితే తన నగలన్నీ తీసి యిచ్చివేసెయ్యమని అడిగింది అలివేణి. లేకపోతే పోలీసులను తీసుకొనివచ్చి కేసు పెట్టిస్తానని బెదిరించింది. "అయితే యీ ప్రేమ అంతా నా నగల మీదగాని నామీద కాదన్నమాట" అని రామప్రియ తన వంటి నగలన్నీ తీసి తల్లిచేతుల్లో పెట్టింది. "వినాశకాలే విపరీతబుద్ధిః" అని దీవించి అలివేణి నిష్క్రమించింది. తన తల్లిచేసిన అవమానానికి రామప్రియ రామశాస్త్రికి ఎంతో క్షమార్పణ చెప్పుకొంది. పొంగి పొరలివచ్చే దుఃఖం, వెక్కి వెక్కి యేడ్చిన యేడ్పు కన్నీరుగా వాళ్ల పరుపుచుట్ట నంతా తడిపివేసింది. రామశాస్త్రి ఆమెను సేదదేర్చుతూ ఉన్నాడు గాని, లోకానుభవంలేని తనకు—ఇప్పుడు చేసిన నిశ్చయం కల్పించే విపత్పరంపరలు భీషణంగా ఎదుర్కొనేటప్పటికి భీరువుగా లొంగిపోవాలో, ధీరుడుగా ధిక్కరించాలో తెలియని అవస్థలో పడ్డాడు.

అలివేణి పెద్ద కార్పణ్యంతో కూతురినీ, రామశాస్త్రినీ నిగ్రహించాలని గురువుగారైన పేరిశాస్త్రి గారివద్దకు వెళ్లి, కథ అంతా పూసగ్రుచ్చినట్టు చెప్పింది. ఆ సద్బ్రాహ్మణుడు రామశాస్త్రి దక్షిణాదికి విద్యకోసం వెళ్లాడనుకున్నాడుకాని ఈ వృత్తాంతం నమ్మలేకపోయాడు. ఘోరావమానంగానూ, విప్రకులానికి తీరని కళంకంగానూ తలచి, రామశాస్త్రి స్వగ్రామం వెళ్లి అక్కడ ఉన్న శాస్త్రి తల్లిగారికీ సంగతంతా తెలియజేశాడు. రామశాస్త్రి తండ్రిలేని బిడ్డ. చిన్నతనంనించీ తల్లే పెంచి పెద్దచేసి విద్యాబుద్ధులు గరపింది. స్మార్తంచెప్పించాలని ప్రయత్నం చేశారుగాని, అది అతనికి అబ్బలేదు. మొదటినించీ సంగీతం అంటే అభిమానంతో రామశాస్త్రి అటు దృష్టి చూపాడు. దానికి తగినట్టు మంచి గురువువద్ద శుశ్రూష లభించింది. బాగా విద్యా వచ్చింది. చివరకు యిటువంటి అప్రతిష్ఠకార్యం

చేశాడేమిటి అని తల్లికడుపు చెరువై పోయింది. వెంటనే ఆమె కొడుకుజాడలు వెదకుకొంటూ పేరిశాస్త్రి గారిని తోడుచేసుకొని వెంట బయలుదేరింది. వారు మద్రాసుపట్టణం వచ్చేటప్పటికి రామశాస్త్రీ, రామప్రియా తిరువనంతపురం వెళ్లిపోయారు. అక్కడే అతనికి సంగీతం నేర్చుకోవడానికి తగిన నెలవు దొరికింది. అతనివెంట తల్లీ, గురువూ వెదకుకుంటూ పోకతప్పింది కాదు. చివరకు అందరూ తిరువనంతపురం చేరుకొన్నారు. సమయానికి రామశాస్త్రి కొత్తగురువుగారి వద్దకు వెళ్లాడు. బసలో రామప్రియ ఒక్కర్తే వుంది. గురువుగారినీ, వారితోకూడా వృద్ధమాతనూ చూడగానే ఆమెహృదయం క్రుంగిపోయింది. వెక్కివెక్కి యేడ్చింది. పేరిశాస్త్రిగారు రామశాస్త్రిని పిలవడానికి వెళ్లిపోయారు. ఆ స్త్రీలు ఇద్దరూ ఉండిపోయారు. ఇద్దరి మనస్సులలోనూ ప్రేమ ఉంది. తన కొమారుడు తన అధీనం లోంచి తప్పిపోకూడదని ఆ తల్లి ఆరాటం. తన ప్రియునికోసం ఎంత త్యాగమైనా చేసి అతన్ని దక్కించుకోవాలని ఆ ముద్దరాలి పట్టుదల. తల్లి పొంగిపొంగి వచ్చే దుఃఖంతో ఏడ్చి, చిన్నతనంనించీ రామశాస్త్రిని తానెలా పెంచి పెద్దచేసిందీ చెప్పింది. వారిది గానావర్ఘులవారి వంశం. ఘనం, జటా చెప్పడంలో వారిది పెట్టింది పేరు. అటువంటి అగ్నిహోత్రంలాంటి పవిత్ర వంశానికి రామశాస్త్రి ఒక్క అంకురం. అతను ఒక్కడూ ఇలా వెలియైపోతే వంశం ఏంగాను? అతన్ని ఇన్నాళ్లూ కళ్లల్లో ఒత్తివేసుకొని పెంచుకొని వచ్చింది. అతని మీదే ఆమె పంచప్రాణాలున్నూ, వాళ్ల వంశగౌరవమున్నూ. ఇప్పు డిద్దరిలో ఎవరో ఒకరు త్యాగం చెయ్యాలి. తాను త్యాగం చేస్తే వంశం త్యాగంచెయ్యాదు. వీడితో కులానికీ, వంశానికీ, గురువుకూ అందరికీ అప్రతిష్ఠ. రామప్రియ త్యాగం చేస్తే పోయింది లేదు. వీడు పోతే మరో మంచివాడు దానికి దొరుకుతాడు. కాక, వాళ్ల కులవృత్తి ఉండనే ఉంది. ఒక్క దుష్టకార్యంవల్ల పాలవంటి వంశం భగ్గంపాడవుతుంది. ఇన్ని వాదించి చెప్పి చివరికి ఆ తల్లి రామప్రియచేతులు పట్టుకొని ఇలా అంది:

"అమ్మా! ఇవి చేతులు కావు, కాళ్లు. నువ్వు నన్ను కనికరించి పుత్రభిక్షు పెట్టవూ? వీ డిలాగ నిన్ను పెళ్లిచేసుకొంటే, ఇటు ఏడుతరాల వాళ్లకూ, అటు ఏడుతరాలవాళ్లకూ గతు లుండవు. యజ్ఞయాగాదులు చేసిన వీడి తండ్రితాతలు పితృలోకాలలో ఏంగాను? నువ్వైనా వాడి క్షేమం కోరుతున్నావు గదా! వాడిని నీతో పాటు అధఃపాతాళ లోకంలోకి దింపితే వాడిని ఎవరు పూజిస్తారు? గానసభలో వాడికి విద్వాంసుడన్న కీర్తి యెలా వస్తుంది? వాడి మేలు కోరినదానివైతే, వాడి ఉన్నతి కోరినదానివైతే నామాట విను. నీ వృత్తిలోకి నీవు వెళ్లిపో. అంధకూపంలోకి వాడిని క్రుంగదీసే బదులు వాడి ఉన్నతిలోకి నీవు రా! తల్లిని, వాడి క్షేమం, నీ క్షేమం కోరినదాన్ని! నామాట వినవూ?"

అని ఆమె తన హృదయం అంతా విప్పి చెప్పింది. ఈ మాటలు చెబుతూవుంటే, రెండేళ్ల క్రితం రామశాస్త్రి శమీపూజాపత్రం వ్రాస్తూ కోరిన వరంమాట జ్ఞాపకం వచ్చింది. 'ఇదే నవరాత్రులకు గానసభ చెయ్యాలి. నలుగురితోపాటు ఈమెచేత భేష్ అనిపించుకోవాలి'. తాను అటువంటి విద్వాంసుణ్ని వివాహంచేసుకొంటే ఈ కోరిక ఎలా తీరుతుంది? అవును, ఆమె అన్నట్టు, ఈయన భ్రష్టుడైతే ఎవరాదరిస్తారు? సభాపూజ్యత ఎలా వస్తుంది! తాను కోరేది ఆతని ఉన్నతి, ఆతని క్షేమం! తాను మానప్రాణాలు కోల్పోయినా సరే, ఆతని పేరుప్రతిష్ఠలు, కులప్రతిష్ఠలు కాపాడాలి. నిశ్చయంచేసుకొంది. ఆతల్లి ప్రార్థన అంగీకరించి రామశాస్త్రి రాకుండానే ఆమెతో వెళ్లిపోవా లనుకొంది.

రామశాస్త్రిని వెంటబెట్టుకొని పేరిశాస్త్రిగారు వచ్చారు. కొడుకును చూచి తల్లి ఒక్కసారి భోరుమన్నది. రామశాస్త్రి మహాపరాధం చేసిన నేరస్థుడిలాగ తల వాల్చే నిలువబడ్డాడు. పేరిశాస్త్రిగా రందుకొని "యిప్పటికైనా మించిపోయింది లేదు. ఈ రామప్రియకూడా తెలివిలేనిది, అవివేకవతి కాదుగదా!" అని చెప్పబోతున్నాడు.

ఇంతలో ఆ వృద్ధమాత మాటకు అడ్డువచ్చి—

"గురువుగారూ! రామప్రియలాంటి గుణవంతురాలుంటుందటండీ! ఏదో విధివ్రాత, అలా తప్పి పోయి ఆ కులంలో జన్మించింది. నిజానికి బొగ్గుల్లో మాణిక్యం! మనం చెప్పకుండా ఆ పిల్లే గ్రహించింది" అని కొంచెం. సంతోషం ముఖంమీద కనబరుస్తూ పైటచెరగుతో కన్నీళ్లు అద్దుకొన్న దా వృద్ధురాలు!

" నే నన్నానుకాదూ! ఇంతకూ వేళావిశేషం. కాని మనం చూచాయగా అంటించేటప్పటికి గ్రహించుకుంది. రత్నంలాంటిది" అని పేరిశాస్త్రిగారు ప్రశంస చేశారు.

రామశాస్త్రికి ఇ దేమీ అర్థం కావడం లేదు. ఆ తల్లి రామప్రియను దగ్గరకు తీసుకొని "మా చల్లని తల్లి! అన్నమాట తీసి పార వేయలేదు. లేవండి, మరి శాస్త్రిగారూ! మనతోటే వచ్చివేస్తుంది. తీసుకొని పోదాం!" అని ఉన్న సంగతి చెప్పింది.

"అవును, ఇంక వేరే ట్రెయిను లేదుకూడాను. యీ బండిలోనే వెళ్ళిపోవచ్చు. నాయనా! రామశాస్త్రి! అదొక గ్రహచారం—ఏదో రాహు భుక్తి లాగ వచ్చింది, వెళ్లి పోయింది. విడుపు అయిపోయింది. ఇదొక పీడకలలాగ మరచిపో! సంగీతం నేర్చుకొని, నలుగురిలోనూ అవు ననిపించుకో." అని సలహా యిచ్చి ఆయన నిష్క్రమించారు.

రామశాస్త్రి మనస్సులో రేగిన పెనుతుపాను మౌనముద్రతో ఆపాడేమో కాని మాటలాడడం మొదలుపెట్టితే ఏమయ్యేదో!

రామప్రియలో ఈ మార్పు ఎలావచ్చిందో బోధపడలేదు. 'పీడకలలాగ మరచిపో' అని గురువుగారు చెప్పారు. రామప్రియ మూగచూపులతో సెలవు తీసుకొంది. ఆమెజీవితంలో ఇది పీడకలో, మధుర స్వప్నమో! తన జన్మకు తగని కోరిక కోరింది. కులీనగా జీవించదలచింది. అది సాగనీయలేదు సంఘం. తనను అపార్థం చేసుకొంది. తనకు ఆప్తులు సైతం తాను కోరిన మార్గం అపమార్గ మని అన్నారు. లోకం అన్నది సత్యమా, తాను కోరింది సత్యమా? మానాభిమానాలు చంపుకొని అసత్య జీవితం జీవిస్తేనే లోకం హర్షిస్తుందే! తనతోపాటు లోకం ఉండదు. తన్ను ద్వేషిస్తుంది. అందుచేత లోకంతోపాటు తాను జీవించాలి.

రామప్రియ లోని అభిమానం చంపుకొన్నది. ఆత్మను అసత్యంవెనుక దాచివేసింది. ఇక్కడి నుంచి సిగ్గూ, లజ్జా లేని ధన సంపాదనా యంత్రంలో పరకాయప్రవేశం అయింది. రామప్రియ కిదొక కొత్త అవతారం.

## 3

ఎనిమిది సంవత్సరాలు గడచి పోయాయి. రామశాస్త్రి 'సంగీత భూషణు' డయ్యాడు. దక్షిణాది విద్వాంసులతో సరిసమాన హోదాతో వివిధ సంగీత వేదికలమీద పాటకచ్చేరీలు చేసి, సెబాస్ అనిపించుకొంటున్నాడు. దక్షిణ దేశంలో వివిధ సంస్థానాలు పర్యటనచేసి, ఆయారాజుల ప్రత్యేక ప్రశంసలంది, చివరకు మద్రాసు చేరుకున్నాడు. రేడియోలో రెండు మూడు సారులు అతడు పాడిన పాటకు తెనుగు పత్రికలూ, తమిళ పత్రికలూకూడా జేజేలు పాడాయి. అతని కీర్తి నలుదెసలా వ్యాపిస్తూవుంది. పట్టణంలోని వివిధ సభలలోనూ అతని గానకాలక్షేపాలు ఆబాల గోపాలమూ విని ఆనందిస్తున్నారు.

క్రమేణా ఆంధ్ర దేశంలో కూడా అతని ప్రతిష్ఠ వ్యాపించింది. దేవీ నవరాత్రాలు వచ్చాయి. ఆంధ్ర దేశంలో అఖండప్రశస్తి చెందిన కాకినాడలో సరస్వతీ గాన సభలకు మహార్నవమినాడు రామశాస్త్రిగారు గానం చెయ్యవలసిం దని ఆహ్వానం వచ్చింది. ఇన్నాళ్ళకు తాను కలలుగన్న కోరిక నెరవేరబోయే తరుణం వచ్చింది. సరస్వతీ గాన సభల్లో తన స్వంత కచ్చేరీ! పదేళ్ళక్రితం శమీ పూజాసమయంలో తాను కోరిన వరం. సరస్వతీ విగ్రహంముందు వేదికపై కూర్చున్నాడు రామశాస్త్రి. గానసభ కిటకిటలాడుతూవుంది. స్త్రీల ప్రత్యేక స్థలంవైపు అతని దృష్టి ప్రసరించింది. ఒక అంగనామణి కర్ణభూషలలోని రెండు చిరత్న

రత్నాలు తళుక్కు మన్నాయి. వంచిన తల యెత్తగానే ముక్కుపై రవ్వల బేసరి కన్ను విప్పింది. తుమ్మెద ఝుంకారంలాగున తంబురా ఝుమ్మనే శ్రుతి అందిస్తూవుంటే మొదట్లోనే మూడోకాలంలో వసంతరాగవర్ణం అందుకున్నాడు. ఫిడేలూ, మృదంగం తటాపటాయించే లోపున ఒక ముత్యాల వాన కురిసినట్లు రామశాస్త్రి స్వరాలు పలుకుతూ ఒక్క చిరునవ్వు విసిరాడు. తీర్చిదిద్దిన కాటుకకళ్లుగాని, పవుడరు పులిమిన దళసరి చెక్కిళ్లుగాని ఒక ముదిత హృదయాన్ని దాచలేకపోయాయి. రామప్రియను గుర్తించాడు రామశాస్త్రి సభాసదుల్లో. వర్ణంలోని చాకచక్యం గుర్తించే లోపున సౌరాష్ట్రరాగంలో త్యాగయ్య వారి "శ్రీగణపతిని" అందుకొన్నాడు. రామప్రియ చూపుల్లో మెప్పు కనిపించలేదు. మూడో కీర్తన రామప్రియ రాగంలో "కోరిన వర మొసగుమయ్య" అని పట్నం సుబ్రహ్మణ్యయ్యగారు రచించిన కీర్తన. రామప్రియకు అభిమానరాగం—అభిమాన కీర్తన. ఆలాపనలోని రాగచ్ఛాయలలో కొత్త మెలకువలు పలికిస్తూ వుంటే సభాసదులు సంగీతరసవార్నిధిలో మునకలు వేస్తున్నారు. రామప్రియ దీనితో రససిద్ధి పొందింది. మనస్సులోని ఆనందాతిశయం ఆపలేక ప్రక్కనున్న తోడి నర్తకిని కౌగిలించుకొంది. ఒక కొత్త కీర్తన అపూర్వరాగంలో పాడి స్వరకల్పన చేస్తూవుంటే, ఫిడేలు-మృదంగ వాద్యకులు ముఖముఖాలు చూచుకొన్నారు. గానసభ మంచి రక్తిలో ఉంది. సభాసదు లందరూ తదేకతత్పరులై రస పిపాసతో ఆలకిస్తున్నారు. కృతిమీద చరణంలో ఆయన వేసిన స్వరకల్పన చిత్తజల్లులాగ కురిసి వెలిసింది. తిరిగి నిశ్శబ్దం. ఝుమ్ ఝుమ్మని తంబురా శ్రుతి. పా పా సా అని త్రిస్థాయిలో ఆలాపన ప్రారంభించి మేఘగంభీరనిస్వనంతో అందుకొన్నాడు. వెలుపలి ప్రకృతికూడ అరుణశేఖలతో సంధ్యాశోభ రూపించి మసకచీకటిలో సేద తీర్చుకొంటూ ఉంది. దీపారాధన, దూరాన దేవాలయంలోని చిరుగంటలు వినిపించినా సభాసదుల్లో ఎవ్వరూ లేవడంలేదు. పల్లవి యే రాగంలో పాడతారా అని రసికులు ఉవ్విళ్లూరుతున్నారు. సమయోచితంగా రామశాస్త్రి 'కామవర్ధని' అందుకొన్నాడు. ఈ రాగంపోకడలే వింతవింత తోవలు చూపుతున్నాయి. గంటసేపు పైగా రాగాలాపనే. ముగ్ధురాలై చూస్తోంది రామప్రియ! ఆనాడు శమీపూజ చేసి అతడు కోరిన వరం నెరవేరింది. గానసభలో గద్దెమీ దెక్కి నలువురిచేత సెహబాన్ అనిపించుకొన్నాడు. తాను మెచ్చుకొన్నది. తన జీవిత మంతా ఒక చలనచిత్రంలాగ కనిపించింది. దాని వెనుక అతడు పాడిన తానం, పల్లవి, స్వరకల్పన భీషణమైన నేపథ్యసంగీతంలాగ వినిపిస్తోంది. ప్రజల హర్షధ్వనులు, కరతాళధ్వనులు. అతడు సాధించాడు. తానో! ఊహించిన స్వర్గానికీ, అనుభవించే నరకానికీ ఎంత తారతమ్యం! కాని తోడివారందరూ "రామప్రియ కేమమ్మా? మూడుమేడలు కట్టింది, వంటినిండా రత్నాల నగలు, దాసదాసీజనం, గొప్ప పేరుప్రతిష్ఠలు" అంటారు. ఇవన్నీ తనలోని మానం, ఆత్మ పరిత్యజించినతర్వాత వచ్చినవే! ఈ ఎనిమిదేళ్లూ తాను జీవించినది యంత్ర జీవితం. తనలోని మానవత్వం చల్లని, మంచి సంగీతం వినగానే తిరిగి మేల్కొన్నది. జలపాతంలాగ జిమ్ముకొంటూ రాబోతోంది. ఇంక ఆగలేక వెళ్లిపోయింది.

విజయదశమి రాత్రి. శమీపూజ! ఊరేగింపులో అలివేణి కూతురు రామప్రియ మేజువాణి. ఊరంతా తిరిగి ఏనుగు జమ్మిచెట్టు దగ్గరికి వచ్చింది. అక్కడ నాయకురాలిచేత ఆడించాలని కొంతమంది కోణంగిగాళ్ల ప్రయత్నం. సభచేసి కొలువు తీరి స్తేతప్ప నాయకురాలు నాట్యంచేయడం లాంఛనం కాదు. ఎంతమంది చెప్పినా రామప్రియ వినలేదు. చివరికి ఏనుగును శమీవృక్షానికి సమీపంగా ఒక యింటివద్ద ఆపి—ఆ అరుగుమీద ఊరేగింపు ఆపి మేజువాణీ చెయ్యమన్నారు. మేజువాణీ చెయ్యడానికి అభ్యంతరం లేదు, కాని నాట్యం మాత్రం చెయ్యలేనని చెప్పింది రామప్రియ. ఎలాగయినా సరే నాయకురాలిచేత గజ్జె కట్టించి తీరా లనుకొన్నారు ఊరి పెద్దలు. రామప్రియ ఎంత బ్రతిమాలినా వినలేదు. తాను ధనసంపాదనచేసే యంత్రం. ధనం ఇచ్చేవారు ఏమి కోరితే అది చెయ్యాలి. ఇదివరకైతే ఏమైనా చేసేది. ఈవేళ తిరిగి తనలో మాన

వత్వం మేల్కొన్నది. పూర్వస్మృతులు జ్ఞాపకం వచ్చి, తాను జారవిడుచుకొన్న పెన్నిధానాన్ని తిరిగి చూపాయి. ఏమైనాసరే తాను పరువుకు భంగం రానీయదు. ఊరేగింపులో గజ్జె కట్టదు. పట్టు, విడుపు ఉండాలి అని పెద్దలతో వాదించింది. తన మేజువాణి కుదిర్చినవారు సమ్ముఖాన లేరు; కొంచెం కోణంగులతో వాదం. "మీరు మా మేళం కుదిర్చినవారు కారుగనక మీతో మాకు ప్రసక్తి లేదు" అని రామప్రియ చెప్పింది. దానితో వారిలో తుంటరులు అల్లరి ప్రారంభించారు. ఆడపాపలమీద అవీ యివీ వెయ్యడం నానా అపభ్రంశాలు మొదలుపెట్టారు. ఆ వూరేగింపులోనే సన్నాయిమేళంవద్దనున్న రామశాస్త్రి వచ్చి చూశాడు. ఇంతలో మేళంవద్ద కక్షలేర్పడ్డాయి. రాళ్లతో గ్యాసులైట్లు పగలగొట్టారు. అంతా చీకటి. బాణాకర్రలు బుర్రల మీద పనులు తున్నాయి. మేళంలోని పాపలందరూ పారిపోతున్నారు. దుండగీండ్రు వారి వెంట బడి తరుముతున్నారు. రామశాస్త్రిగారి స్నిగ్ధహృదయం తన బాల్య స్నేహితురాలి పతనానికి పలవించింది. ఇంతలో పోలీసులు రావడం, కొంత ప్రశాంతి యేర్పడడం జరిగింది. రామప్రియా, తోటి ఆడపాపలూ జమ్మిచెట్టుఎదుట ఉన్న విడిదిలోకి చేరుకొన్నారు. రామప్రియకు కణతమీద బలమైన గాయం తగలడమే కాకుండా, ఎవరో నీచుడు ఆమెకనులమీద ఆసిడ్ పోశాడు. వికృతరూపంతో బీభత్సంగా కనిపిస్తోంది. డాక్టరును పిలిపించి చికిత్స చేయించవచ్చు గాని అంతగా ప్రయోజనం ఉండేటట్టు లేదు. ఆటువంటి దురవస్థలో ఉన్న తన ఆప్తురాలిని రామశాస్త్రి పలుకరించకుండా ఉండలేకపోయాడు.

రామప్రియకు కనులు కనిపించవు. స్వరంతోనే పోల్చింది. "మీ సంగీతం విన్నాను—నా కోసమే పూర్తిగా గానం చేశారేమో! అన్నీ నాతో పలుకరించినట్టయింది. మీరు..."

"నీ కోరిక తీర్చలేక పోయాను. నీవు చేసిన మహాత్యాగానికి అణుమాత్రం కూడా ప్రత్యుపకృతి చేయలేక పోయాను"

"ఇంత కంటే ఏం కావాలి? మీ కోరిక నెరవేర్చుకొన్నారు. నన్ను మీ గానంచే మెప్పించారు. అదే నా కోరికాను"

"కాని యీ దురవస్థలో—నిన్ను చూడటం"

"దురవస్థ! నాకు మంచి శాస్తే జరిగింది. ఈ అసంపూర్ణ జీవితానికి మంచి సమాప్తి"

ఇకన్నీ రామప్రియ యెంతో ఆయాసంతో మాటలాడింది. లోపల పడే వేదన ఆ యానందంలో కనిపించనీయలేదు. క్రీనీడలోనే ఆమె కన్నులు మూస్తూవుంది. వేరే వెలుతురులోకి తియ్యాలని రామశాస్త్రి ప్రయత్నిస్తున్నాడు.

"ఇలాగే పడుకోనీయండి—జమ్మిచెట్టు ఆకుల నీడలే యివి. ఆ చెట్టుమీద మనం కట్టిన చీటిముక్కలు ఇంకా ఉన్నవేమో! ఏదీ ఆ శ్లోకం...శమీ శమయతే పాపం!...రామస్య ప్రియదర్శనీ" అని చిరునవ్వుతో కనులు మూసివేసింది.

"రామస్య ప్రియదర్శినీ" అని మననం చేసుకొంటూ రామశాస్త్రి అడుగులో అడుగు వేసుకొంటూ వెళ్తున్నాడు.

ఆ జమ్మిచెట్టుమీద వాలిన తీతువుపిట్ట అరుస్తూ ఉంటే అది కూడా ఆ శ్లోకపాదమే "రామస్య ప్రియదర్శినీ" అంటున్నట్టుంది.

